# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అధ్యక్షతన కొనసాగుతున్న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం.**

2. **పదోతరగతి పరీక్షా ఫలితాలు విడుదల చేసిన మంత్రి నారా లోకేష్.**

3 **యువత పశుసంవర్ధక రంగంలోకి రావలన్న పశు సంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు.**

4. **రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యే ఇంటింటి జనగణనకు అన్ని ఏర్పాట్లు పూర్తి.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ఈరోజు కొనసాగుతోంది. గుంటూరు జిల్లా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా రాజధాని అమరావతికి సంబందించిన నిర్మాణాల పురోగతిపై చర్చించడంతో పాటు కొన్ని కీలక అంశాలు చర్చకు రానున్నాయని అధికారులు తెలిపారు. SIPB సమావేశంలో ఆమోదం పొందిన పెట్టుబడులపై రాష్ట్ర మంత్రి వర్గం చర్చించి ఆపై ఆమోదం తెలపనుంది..

--------------------------

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు ఫలితాలు విడుదల చేశారు. 85.25 శాతం మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో బాలికలు ముందంజలో ఉన్నారు. బాలికలు 87.90 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 82.68శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం 72.8 నుంచి 78.39కు పెరిగింది. పదవ తరగతి ఫలితాలను www.results.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వాట్సాప్ 'మన మిత్ర' సేవ ద్వారా 9552300009కు 'Hi' అని పంపి ఫలితాలను తెలుసుకోవచ్చు. మే 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. రేపటి నుంచి 9వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఆధికారులు అవకాశం కల్పించారు.

--------------------------

రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్ళిన వారికి సకాలంలో లగేజీ అందకుండా జాప్యం చేసినందుకు బాధ్యత వహిస్తూ సౌదీ ఎయిర్లైన్స్కు చెందిన ఫ్లై ఏ డీల్ సంస్థ 24 లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లించింది. 177 మంది యాత్రికుల బ్యాంకు ఖాతాల్లో 13 వేల 800 రూపాయల చొప్పున జమ చేసిందని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 న 177 మంది హజ్ యాత్రికులు ఆంధ్రప్రదేశ్ లోని గన్నవరం విమానాశ్రయం నుంచి మదీనా వెళ్లారు . వీరికి సంబంధించిన లగేజీని మదీనాలో దిగే సమయానికి చేరవేయలేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని మంత్రి తెలిపారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కిరణ్ రిజిజు, కేంద్ర హజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లానని.... వారు తక్షణమే స్పందించి విమానయాన సంస్థతో పరిహారం విడుదల చేయించారని మంత్రి వివరించారు.

---------------------------

హైదరాబాద్‌లో ఈరోజు జరగాల్సిన కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు వాయిదా వేశామని, ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని కృష్ణా బోర్డు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నిన్న సమాచారం ఇచ్చింది.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా లాసెట్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి వి. ఉమ తెలిపారు. లాసెట్ పరీక్షలకు 30 వేల 20మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకున్నారని ఈరోజు ఆమె తిరుపతిలో విలేకరులకు తెలిపారు. 13 జిల్లాల్లో 100 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల ఏర్పాట్ల గురించి ఉపకులపతి ఉమ వివరిస్తూ...

.. వాయిస్.. 25 సెకన్లు

---------------------------

కృత్రిమ మేధ ప్రభావంతో ఉద్యోగాలు తగ్గే పరిస్థితి ఏర్పడుతోందని ... యువత పశుసంవర్ధక రంగంలోకి రావాలని పశు సంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు కోరారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పశుసంవర్ధక రంగంపై ఆధారపడి ఉన్నారని ఆయన తెలిపారు. గుంటూరు జిల్లా – పశుసంవర్ధక మార్గదర్శిని ఈ–మేగజైన్ ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత ఆర్థిక సంవత్సరంలో పశు సంవర్ధక రంగం 1 లక్షా 76 వేల 151 కోట్ల రూపాయల స్థూల విలువ వృద్ధి కలిగిందని వివరించారు. పాడి పశువులు, కోళ్లు, పందుల పెంపకాన్ని వాణిజ్యపరంగా చేపట్టాలని మంత్రి అన్నారు. ఇందుకోసం విశాఖపట్నంలో 3 రోజుల పాటు 1500 మందికి శిక్షణ ఇవ్వగా 200 మంది తమ వ్యాపారాలు ప్రారంభించారని మంత్రి చెప్పారు. సేంద్రియ పద్ధతుల్లో పెంపకం చేస్తే ఎకరానికి సంవత్సరానికి ఐదారు లక్షల రూపాయలు సంపాదించవచ్చని ఆయన అన్నారు.

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలో రాగల ఐదు రోజులు ఉష్ణోగ్రతలు అధికంగా వుండే ఆవకాశం వున్నందున ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. రాష్ట్ర రియల్ టైమ్ గవర్నెన్స్ విడుదల చేసిన తాజా

నివేదిక ప్రకారం జిల్లాలో 15 మండలాల్లో వడగాల్పుల ముప్పు "డేంజర్" స్థాయిలో ఉన్నట్లు వెల్లడైందని అన్నారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో 41°C నుంచి 54°C వరకు నమోదయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

ప్రధాన మంత్రి భారతీయ జనఔషధ పథకం ద్వారా ప్రజలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలు తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నాయని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బాపట్ల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి భారతీయ జనఔషధ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ కుమార్ మాట్లాడుతూ

.. వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యే ఇంటింటి జనగణనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయనగరం జిల్లాలో జనగణనకు అన్ని ఏర్పాట్లూ పూర్తి అయ్యాయని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర జనగణన నోడల్ అధికారి రావత్, రాష్ట్ర జనాభా లెక్కల ఆపరేషన్స్ డైరెక్టర్ నివాస్ ఈ రోజు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో విజయనగరం కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. స్వీయ జనగణన నమోదు ప్రక్రియలో జిల్లా ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు చెప్పారు. ఇంటింటి గణన ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఎన్యూమరేటర్లందరికీ ఇప్పటికే తగిన శిక్షణ ఇచ్చామని, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించామని కలెక్టర్ తెలిపారు.

---------------------------

రేపటి నుంచి నిర్వహించే ఇంటింటి జనగణన నమోదు కార్యక్రమానికి ఏలూరు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఇంటింటి జనగణన కార్యక్రమంపై ఆమె నిన్న కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జనగణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు శిక్షణా కార్యక్రమంలో తెలియజేసిన అంశాల ననుసరించి ఇంటింటి గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

ప్రకాశం జిల్లా ఒంగోలు పురపాలక సంఘం ఏర్పాటు చేసి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నగరంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ప్రకాశం జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ పి.రాజాబాబు తెలిపారు. ఒంగోలులో పారిశుధ్య నిర్వహణ అత్యత ప్రాధాన్యత అంశమని నిన్న కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన స్థాయిలో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని రాజబాబు తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ను

పూర్తిస్థాయిలో ఆధునీకీకరించి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలో మే 10వ తేదీ నాటికి క్షేత్రస్థాయిలో భూ రికార్డుల పరిశీలన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మే 13వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్‌లను పూర్తి చేసి, మే 17 నాటికి ఆధార్, డేటా సవరణలు పూర్తి చేయాలని నిన్న కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల నివారణ, భూ రికార్డుల నవీకరణ, మ్యూటేషన్ కేసుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. భూ వివాదాలు, పాసు పుస్తకాలు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాల జారీ, ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు.

---------------------------

తిరుపతి జిల్లా తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వసంతోత్సవాలకు నిన్న రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఈ రోజు నుంచి 3 రో జుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ అర్చకులు నిన్న పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు.

======================